ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బషీరాబాద్, ఫిబ్రవరి 26: నవాంద్గీ పంచాయతీలో రూ.6లక్షలతో చేట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు సోమవారం ప్రారంభించారు. పలు కాలనీల్లో అంతర్గత రోడ్లన్నీ మట్టి రోడ్లుగా ఉండటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఎట్టకేలకు ఉపాధిహామీ నిధులు మంజూరు కావడంతో సీసీ రోడ్ల నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి సహకారంతో నిధులు మంజూరయ్యాయని స్థానిక నాయకులు తెలిపారు.



మేడ్చల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ ప్రశంసనీయం

- ఎమ్మెల్యే మల్లారెడ్డి
- అమృత్ భారత్ కింద మేడ్చల్, వికారాబాద్ రైల్వే స్టేషన్ల అభివృద్ధి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 26 : దేశంలోని రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ పథకం కింద ఎంపిక చేసి వాటిని ఆధునికీకరించడానికి పనులు ప్రారంభించడం ప్రశంసనీయమని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లా రెడ్డి అన్నారు. సోమవారం మేడ్చల్ రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ పథకం కింద రైల్వే స్టేషన్ అధునీకరణ పనులను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించే కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ రైల్వే స్టేషన్ అభివృద్ధితో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందడంతో పాటు, మేడ్చల్ పట్టణ పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గతంలో రైల్వే స్టేషన్లు దుర్గంధంతో కంపుకొడుతూ ఉండేవని ప్రస్తుతం ఆధునికీకరణతో ఎయిర్‌పోర్టును తలపించే విధంగా అభివృద్ధి చేయనున్నారన్నారు. మేడ్చల్ ప్రజల కోసం అందిస్తున్న అమృత్ భారత్ సేవల పట్ల ప్రధాని మోదీకి ఎమ్మెల్యే ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో అండర్ పాస్ పనులతో పాటు గౌడవెల్లి గ్రామంలో పనులను త్వరగా పూర్తి చేసి ప్రజల కష్టాలు తీర్చాలని రైల్వే శాఖ అధికారులను కోరారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపికానర్సింహారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, రైల్వే శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఒకే వేదికపై వివిధ పార్టీల నాయకులు..

అమృత్ భారత్ పథకం కింద మేడ్చల్ రైల్వేస్టేషన్ అధునీకరణ పనుల ప్రారంభోత్సవానికి విచ్చేసిన పలు పార్టీల నేతలు ఒకే వేదికపై రాజకీయలకు అతీతంగా ఉల్లాసంగా గడిపారు. రైల్వేశాఖ అధికారులు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన నాయకులకు ప్రత్యేకంగా ఆహ్వానించారు. దీంతో కార్యక్రమానికి చేరుకున్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్‌శరత్ చంద్రారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నియోజక వర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డిలు ఒకే వేదిక పైకూర్చుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. జోకులు వేసుకుంటూ నవ్వుతూ కన్పించారు.



వికారాబాద్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, శుభప్రద్‌పటేల్ తదితరులు

వికారాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ. 24.35 కోట్లు

వికారాబాద్ : అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద వికారాబాద్ రైల్వేస్టేషన్ అధునీకరణకు రూ. 24.35 కోట్లు మంజూరు కాగా, ప్రధాని మోదీ వర్చువల్‌గా పనులకు శంకుస్థాపన చేశారు. దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, ఆయా రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ రైలును తీసుకురావడం జరుగుతుందన్నారు. బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ. వికారాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. అనంతగిరి, రామయ్యగూడ గేట్ల వద్ద బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌ను కోరారు.

కాంగ్రెస్ పార్టీ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తోంది. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10లక్షల వరకు ఉచిత వైద్యంలను అమల్లోకి తెచ్చింది. తాజాగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ స్కీమ్‌లను నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. చేవెళ్లలో మంగళవారం నిర్వహించే సభలో సీఎం ఈ పథకాలను రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి తేనున్నారు. చేవెళ్ల సభ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ శశాంక సోమవారం దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వందలాది మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. సభ పూర్తయ్యే వరకు పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

సీఎం సభకు సర్వం సిద్ధం!



సభ ప్రాంగణంలో ఏర్పాట్లు

భారీ బందోబస్తు

చేవెళ్లలో ప్రభుత్వం నిర్వహిస్తున్న బహిరంగ సభకు పోలీస్ అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సభకు మొత్తం 1,260 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ముగ్గురు డీసీపీలు, 9మంది ఏసీపీలు, 37మంది సీఐలు, 109 మంది ఎస్సైలు, 960 మంది కానిసేబుళ్లు బందోబస్తులో పాల్గొంటున్నారు. వీరు కాక 300మంది ట్రాఫిక్ పోలీస్‌లు సైతం పాల్గొంటున్నారు.

చేవెళ్లలో నేడు రెండు పథకాల అమలుకు శ్రీకారం

- సభ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించిన కలెక్టర్ శశాంక
- లక్ష మంది జన సమీకరణకు అధికారుల చర్యలు
- భారీ బందోబస్తు.. ట్రాఫిక్ ఆంక్షలు



బారికేడ్ల ఏర్పాటు

రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల, ఫిబ్రవరి 26 : కాంగ్రెస్ పార్టీకి చేవెళ్ల గడ్డ ఓ సెంటిమెంట్. దివంగత వైఎస్సార్ చేవెళ్ల నుంచే ప్రతీ కార్యక్రమాన్నీ ప్రారంభించేవారు. అదే సంప్రదాయాన్ని కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తోంది. ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ డిక్లరేషన్ బహిరంగ సభను చేవెళ్ల నుంచే విజయవంతంగా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆరు గ్యారంటీల్లోని రెండింటిని మంగళవారం చేవెళ్ల నుంచే శ్రీకారం చుట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమయ్యారు. ఇక్కడి ఫరా ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో బహిరంగ సభకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేవెళ్లలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి 200 యూనిట్ల ఉచిత విద్యుత్(గృహజ్యోతి), రూ.500కే గ్యాస్ సిలిండర్(మహాలక్ష్మి) పథకాలను ప్రారంభించనున్నారు. బహిరంగ సభ ఏర్పాట్లను కలెక్టర్ శశాంక దగ్గరుండి పర్యవేక్షించారు. సభ నిర్వహణపై వివిధ శాఖ అధికారులకు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న చేవెళ్ల సభకు అన్ని జిల్లాల నుంచి ప్రజలను తరలించనున్నారు. బహిరంగ సభ సాయంత్రం 5గంటలకు ప్రారంభమవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. కాగా సభకు ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సభకు లక్ష మంది వచ్చే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. బహిరంగ సభకు వచ్చేందుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి బస్సుల్లో జనాన్ని తరలించే ఏర్పాట్లు చేశారు. మహాలక్ష్మి పథకానికి ముఖ్యంగా మహిళలను తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. చేవెళ్లలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. బహిరంగ సభ ప్రాంగణంలోనే సీఎం రేవంత్‌రెడ్డి కోసం రెండు హెలీ ప్యాడ్‌లను సిద్ధం చేశారు. హెలీప్యాడ్, స్టేజి ఏర్పాట్లు, పార్కింగ్ తదితర అంశాలపై కలెక్టర్ పరిశీలించారు.

ట్రాఫిక్ ఆంక్షలు.. వాహనాల దారి మళ్లింపు

చేవెళ్లలో నేడు సీఎం సభ ఉన్నందున మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9గంటల వరకు చేవెళ్ల మీదుగా వచ్చే వాహనదారులకు ట్రాఫిక్ ఆంకాక్షలు ఉంటాయని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. రాష్ట్ర పోలీసు అకాడమీ నుంచి చేవెళ్ల మీదుగా వికారాబాద్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ ఎక్స్ రోడ్డు మీదుగా మళ్లిస్తారు. చేవెళ్ల మండలం ఎన్కెపల్లి, ఆలూర్ మీదుగా వికారాబాద్ వైపు వాహనాలు దారి మళ్లిస్తారు. వికారాబాద్ నుంచి చేవెళ్ల, మొయినాబాద్, హైదరాబాద్ వైపు వచ్చే వాహనాలను చేవెళ్ల మండలం ఆలూర్ మీదుగా ఎన్కెపల్లి, ప్రగతి రిసార్ట్ మీదుగా హిమయాత్‌నగర్ నుంచి హైదరాబాద్ వైపు మళ్లిస్తారు. షాబాద్ నుంచి వికారాబాద్ వైపు వెళ్లే వాహనాలను చేవెళ్ల మండలం పామెన, బస్తేపూర్‌ల మీదుగా వికారాబాద్ మళ్లిస్తారు. శంకర్‌పల్లి నుంచి చేవెళ్ల వైపు వచ్చే వాహనాలను ఎన్కెపల్లి రోడ్డు మీదుగా ఆలూర్ నుంచి మళ్లిస్తారు. హిమాయత్‌నగర్ నుంచి చేవెళ్ల వైపు వచ్చే ట్రాఫిక్‌ను ముడిమ్యాల్ స్టేజి నుంచి రావులపల్లి, మల్కాపూర్ మీదుగా చేవెళ్లకు మళ్లిస్తారు. ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

అధికారులు బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలి : కలెక్టర్ శశాంక



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

చేవెళ్లలో నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి సభను అధికారులంతా సమన్వయంతో పనిచేసి విజయవంతం పనిచేయాలని కలెక్టర్ శశాంక సూచించారు. చేవెళ్లలోని ఫరా ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేటి సాయంత్రం 5గంటలకల్లా హెలికాప్టర్‌లో చేవెళ్ల చేరుకుంటారన్నారు. హెలీప్యాడ్ నుంచి నేరుగా ఫరా ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించే బహిరంగసభకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా 200యూనిట్ల ఉచిత కరెంట్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాల అమలు కార్యక్రమాన్ని సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. బహిరంగ సభ అనంతరం సీఎం తిరిగి వెళ్లే వరకు అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడా చిన్న పొరపాటు జరగకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కలెక్టర్ శశాంక హెలీప్యాడ్, స్టేజ్ ఏర్పాటు, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సాయిరాం, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డిప్యుటీ సీఈవో రంగరావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

అట్టహాసంగా మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

- హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు, నవీన్‌మిట్టల్, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



మంత్రి శ్రీధర్‌బాబుకు జ్ఞాపిక అందజేస్తున్న చైర్మన్

కీసర, ఫిబ్రవరి 26: చీర్యాల్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గంగా భ్రమరాంబికా సమేత శ్రీ మల్లికార్జున స్వామి విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ ఈదులవాడ వినయ్ శర్మ, భోగి సాయిశర్మ ఆచార్య ఆధ్వర్యంలో ఉత్సవాలు గణపతి పూజతో ప్రారంభించారు. అనంతరం గోపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, యంత్రమూరజనలు, యాగశాల ప్రవేశం, త్రిశూలపూజ, మృత్యంగ్రహణ, అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, నీరాజన, మంత్రపుష్పాలతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ వేడుకల్లో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రాష్ట్ర రిజిస్ట్రేషన్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ దంపతులు, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీ నారాయణ దంపతులు, ధర్మకర్త శ్రీహరిగౌడ్ దంపతులు, మంత్రి శ్రీధర్ బాబుకు, నవీన్ మిట్టల్ దంపతులుకు, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌లకు శాలువతో సత్కరించి, స్వామివారి జ్ఞాపికను అందజేయగా, అర్చకులు తీర్థ ప్రసాదములు ఆశీర్వచనలు, అందజేశారు.

పెండింగ్ పనులు మార్చిలోపు పూర్తి చేయండి

- వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి
- జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సునీతారెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 26 : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 455 పనులను మార్చి 31వ తేదీలోగా పూర్తి చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ కార్యాలయంలో పనులు, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీలతో ఆమె సమీక్ష నిర్వహించారు. జిల్లా పరిషత్ కింద రూ.14 కోట్లతో మంజూరు చేసినా 428 పనులు, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.4.87 కోట్లు విలువ చేసే 156 పనుల్లో ఇంకా 27 పనులు నేటికీ పెండింగ్ ఉండడంపై ఆమె అధికారులను ప్రశ్నించారు. వచ్చే మార్చి చివరి నాటికి పనులన్నీ పూర్తి కావాలని ఆమె స్పష్టం చేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా జడ్పీలో వ్యవసాయం, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, విద్యా, వైద్య సేవలు, పనులు, ప్రణాళిక పనులు ఆర్థికస్థాయి సంఘాలు ఉండగా, సోమవారం పనులు, సాంఘిక సంక్షేమం స్థాయి సంఘాలపై సమీక్ష నిర్వహించారు. సాంఘిక సంక్షేమం స్థాయి సంఘం చైర్మన్‌గా బొంరాస్‌పేట్ జడ్పీటీసీ కొనసాగుతున్నారు. కాగా, బీఆర్‌ఎస్ జడ్పీటీసీలు జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస నోటీసు కలెక్టర్‌కు అందజేసిన నేపథ్యంలో వివిధ స్థాయి సంఘాల చైర్‌పర్సన్లు, సభ్యులుగా కొనసాగుతున్న ఆపార్టీ జట్పీటీసీలు ఈ స్థాయి సంఘాల సమావేశాలకు దూరంగా ఉన్నారు. వ్యవసాయం, మహిళా సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, విద్యా, వైద్య సేవలు, ప్రణాళిక, పనులు, ఆర్థిక స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించలేదు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి!

- రేపటి నుంచి ప్రారంభం.. నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ



విభాగం	విద్యార్థులు
జనరల్	14,136
ఒకేషనల్	2,687
పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య	16,823
ప్రథమ సంవత్సరం	
జనరల్	6,447
ఒకేషనల్	1,352
మొత్తం విద్యార్థుల సంఖ్య	7,799
ద్వితీయ సంవత్సరం	
జనరల్	7,689
ఒకేషనల్	1,335
మొత్తం విద్యార్థుల సంఖ్య	9,024

వికారాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లాలో ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఇంటర్మీడియట్ విద్యా శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఈనెల 28వ తేదీన ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలు జిల్లాలో మార్చి 16వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇంటర్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 16823 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 7799 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 9024 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 10, సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలు 3, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలు 14, మోడల్, మైనార్టీ జూనియర్ గురుకుల కళాశాలల్లో ఒక్కో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. 29 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 29 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 14 మంది అదనపు చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు కస్టోడియన్ల సేవలు వినియోగించుకుంటున్నారు. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమించనున్నారు. ఈసారి జిల్లాలో జరిగే ఇంటర్ పరీక్షల ఇన్విజిలేషన్ విధులకు 452 మంది ఇన్విజిలేటర్ల సేవలు వినియోగించుకోనున్నారు. అధ్యాపకుల కొరత ఉన్న చోట కేంద్రాల్లో ఉపాధ్యాయులకు ఇంటర్ పరీక్షల ఇన్విజిలేషన్ బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిసింది.

జిల్లాకు చేరుకున్న ప్రశ్న పత్రాలు

జిల్లాలో 29 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వికారాబాద్‌లో 8, తాండూరులో 8, పరిగిలో 5, కులకచర్లలో 2 పరీక్షా కేంద్రాలు, పెద్దేముల్, దోమ, మోమిన్‌పేట్, నవాబ్‌పేట్, మర్పల్లి, కొడంగల్‌ల్లో ఒక్కో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. జిల్లాలో ఇంటర్ పరీక్షలకు మొత్తం.16823 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు శనివారం వికారాబాద్ జిల్లాకు వచ్చాయి. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ పట్టణాలతో పాటు ఇతర మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిపాజిట్ సెంటర్లలో వాటిని భద్రపరిచారు.

వంద మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలు

ఇదిలా ఉంటే పరీక్షా కేంద్రాల చుట్టూ వంద మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్ష కొనసాగే సమయంలో జిరాక్సులు, కంప్యూటర్ సెంటర్లు మూసివేసేలా ఆదేశాలు జారీ చేశారు. సీసీ కెమెరాల నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు కొనసాగేలా చర్యలు చేపట్టారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ప్రశ్నపత్రాల కవర్లు తెరవడం, సమాధాన పత్రాలు కవర్లలో సీల్ చేయడం వంటి పనులు సీసీ కెమెరాల నిఘాలోనే చేపట్టనున్నారు.

పరీక్షా కేంద్రాలు	ప్రభుత్వ యాజమాన్య కేంద్రాలు	ప్రైవేట్ యాజమాన్య కేంద్రాలు
29	15	14

తనిఖీల కోసం ప్రత్యేక బృందాలు

ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేశారు. రెండు సిట్టింగ్ స్క్వాడ్, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, ఒక డెక్ బృందం పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్ జరగకుండా విస్తృతంగా తనిఖీలు నిర్వహించనున్నాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, డిప్యూటీ తహసీల్దార్, ఎస్ఐ/ఏఎస్ఐ సభ్యులుగా ఉంటారు. సిట్టింగ్ స్క్వాడ్ బృందంలో జూనియర్ లెక్చరర్లు ఇద్దరు ఉంటారు. అదేడెక్ బృందంలో సీనియర్ ప్రిన్సిపాల్, జూనియర్ లెక్చరర్లు సభ్యులుగా ఉంటారు. ఈ బృందాలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటాయి. ఎవరైనా కాపీ కొడుతూ పట్టుబడితే మాల్ ప్రాక్టీస్ కింద కేసు నమోదు చేయనున్నారు.

నిమిషం ఆలస్యమైనా ఇంటికే....

ఒక్క నిమిషం ఆలస్యమైనా ఇంటర్ విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు. ఉదయం 8గంటల్లోగా విద్యార్థులు తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. 8.15 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్షా కేంద్రాలను గుర్తించేందుకు ఎగ్జామ్ సెంటర్ లొకేటర్ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చారు. హాల్ టికెట్ నంబరు నమోదు చేస్తే విద్యార్థి ఉన్న ప్రదేశం నుంచి పరీక్షా కేంద్రం ఎంత దూరంలో ఉందనేది ఈయాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ఎండల తీవ్రత నేపథ్యంలో కేంద్రాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలి


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు

పరిగి, ఫిబ్రవరి 26 : పరిగిలోని శ్రీలక్ష్మీనర సింహస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పూర్తి సహకారాన్ని అందిస్తానని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం దేవాలయ అవరణలో ఉత్సవాలకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు గతంలో ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో జరిగేవని, ఈసారి నుంచి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతుండడం శుభపరిణామమని చెప్పారు. గతం కంటే భిన్నంగా పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహించాలని, అందుకు తాను అన్ని రకాలుగా సహకారం అందిస్తానని తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలకు ఇప్పటి నుంచే అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మార్చి 18, 19, 20 తేదిల్లో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యదర్శి శ్రీనివాస్ చెప్పారు. ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని, అందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, సీఐ ఎస్.శ్రీనివాస్, పురోహితుడు పార్థసారథి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శి కె.హన్మంత్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, మండలాధ్యక్షుడు బి.పరుశరాంరెడ్డి, నాయకులు ఎస్‌పి బాబయ్య, బీఎస్ అంజనేయులు, పాలాది శ్రీనివాస్, ఆశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయం గురించి ఎమ్మెల్యే ఆరా..

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని పలు విషయాల గురించి స్థానిక పురోహితుడి ద్వారా ఎమ్మెల్యే ఆరా తీశారు. హుండీ, నెలవారీ ఆదాయం, దేవుడి అభరణాలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఆలయ భూములను ఆక్రమిస్తే చర్యలు


ఆలయ భూములను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ అనిత

కడ్తాల్, ఫిబ్రవరి 26 : ఆలయాల భూములను ఆక్రమించినా, వాటిలో అక్రమ నిర్మాణాలు చేపట్టినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని దేవాలయ భూముల పరిరక్షణ డిప్యూటీ కలెక్టర్ అనిత, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ హెచ్చరించారు. కడ్తాల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయాల భూములను సోమవారం వారు పరిశీలించారు. ఆలయ భూమికి కంచె ఏర్పాటు పనులు చేపట్టగా రెండు రోజుల క్రితం అన్మాస్‌పల్లి, సాయిరెడ్డిగూడ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు ఆ పనులను నిలిపివేయించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు జిల్లా దేవాదాయ శాఖ, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా దేవాలయ భూముల పరిరక్షణ డిప్యూటీ కలెక్టర్ అనిత, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఈవో మోహన్‌రావులు అన్మాస్‌పల్లి గ్రామానికి చేరుకొని ఆలయ భూములను పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడారు. ఆలయాల భూముల పరిరక్షణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం పోచమ్మగడ్డ తండా సమీపంలో సర్వే నెంబర్ 120లో దేవాలయ భూమిని వారు పరిశీలించారు. ఆ తర్వాత సర్వే నెంబర్ 76లో గల ఆలయ భూమిని పరిశీలించారు. ఆ భూమిని సర్వే చేయించి కంచె ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు. కాగా ఆలయ భూమిలో రహదారికోసం స్థలాన్ని కేటాయించాలని స్థానికులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పాలాది ఆంజనేయులు, ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, దేవాదాయశాఖ అధికారులు కృష్ణగౌడ్, బోద్యనాయక్, ఆంజనేయులు, నాయకులు భాస్కర్‌రెడ్డి, సాయిరెడ్డి, యాదయ్యగౌడ్, మాజీ సర్పంచ్ శంకర్, ఎగిరిశెట్టి బాబు, బీక్యనాయక్, జగన్, దేవాదాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

శివాలయం అభివృద్ధికి సహకరిస్తా : ఎమ్మెల్యే


శివస్వాములతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరురూరల్, ఫిబ్రవరి 26 : తాండూరు మండల పరిధిలో బొంకూరులోని శివాలయం అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హామీ ఇచ్చారు. గ్రామ సమీపంలోని పురాతన శివాలయాన్ని శివభక్తులు రాములు, శ్రీను, దాతల సహాయంతో పునఃనిర్మాణం చేపట్టారు. సోమవారం ఆలయంలో శివుడు, నంది విగ్రహం, కలశం, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన చేశారు. ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

రామాయణం, భగవద్గీతపై అవగాహన కలిగి ఉండాలి


యజ్ఞం నిర్వహిస్తున్న పండితులు

యాలాల, ఫిబ్రవరి 26 : రామాయణం, భగవద్గీతపై ప్రతీ హిందువు అవగాహన కలిగి ఉండాలని చెవేళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం యాలాల మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో గీతజ్ఞానయజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రామాయణ, భగవద్గీతల గురించి వివరించారు. అనంతరం ఆయన జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

భాషా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి


బహుమతులను అందజేస్తున్న డీఈవో

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 26 : భాషా నైపుణ్యాన్ని పెంపొందించుకుని ముందుకు సాగితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని యాదాద్రి - భువనగిరి జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం, వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో సోమవారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) ఆధ్వర్యంలో స్పెల్ విజర్డ్ అండ్ డ్రామా కాంపిటిషన్ - 2024ను నిర్వహించారు. ఈ పోటీల ముగింపునకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంగ్లీషులో పట్టుసాధించాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎల్టా ఎంతగానో కృషి చేస్తోందన్నారు. పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 23,144 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎల్టా ఫౌండర్ కొమురయ్య, ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, యూనివర్సిటీ హెచ్‌వోడీలు అనంతలక్ష్మి, శ్రీనివాస్‌రావు, పాల్గొన్నారు.

కూతురి చదువుకు రుణం కోసం ఫోన్‌చేసి..
సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కిన తండ్రి

» రూ. 1,37,000లు పోగొట్టుకున్న వైనం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా రుణం పొందడం కోసం గూగుల్ చేసి.. కనిపించిన నంబర్లకు ఫోన్ చేసి, ఆవలి వ్యక్తుల మాటల్లో పడిపోయారో.. రుణం మాట దేవుడెరుగు, ఉన్న డబ్బంతా ఖాళీ అవ్వొచ్చు! మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌కు చెందిన వేణుగోపాల్ రెడ్డి అనే 52 ఏళ్ల వ్యక్తి ఇలానే నిండా మునిగారు. ఆయన.. తన కూతురు ఉన్నత చదువుల కోసం అప్పు చేయాలనుకున్నారు. నిరుడు డిసెంబరులో 'జస్ట్ డయల్ సర్వీసు'కు ఫోన్ చేసి తనకు రూ.30 లక్షల రుణం కావాలని అడిగారు. తర్వాత వేణుగోపాల్ రెడ్డికి 'బజాజ్ ఫైన్ సర్వీస్' నుంచి అమిత్ అగర్వాల్ పేరుతో ఫోనొచ్చింది. 'మీరు మీ అమ్మాయి ఉన్నతవిద్య కోసం రూ.30లక్షల రుణం అడిగారని తెలిసింది. మా కంపెనీ నుంచి రుణం ఇస్తాం, ఇందుకు ప్రాసెసింగ్ ఫీజు రూ.15వేలు చెల్లించాలి' అని ఆవలి వ్యక్తి చెప్పాడు. నిజమేనని నమ్మిన వేణుగోపాల్‌రెడ్డి 2023 డిసెంబరు 22న రూ.15వేలు పంపారు. తర్వాత బజాజ్ ఫైన్ సర్వీస్ నుంచి ఆ వ్యక్తే మళ్లీ ఫోన్‌చేసి.. బీమా లేకుండా రుణం మంజూరైందని, బీమా కావాలంటే రూ.47,500 పంపాలని చెప్పారు. ఆ మొత్తాన్ని 2023 డిసెంబరు 25వ తేదీన వేణుగోపాల్ రెడ్డి ట్రాన్స్‌ఫర్ చేశారు. జీఎస్టీ కోసం మరో రూ.75వేలు అడిగితే కూడా పంపారు. ఇలా మొత్తం రూ.1.37 పంపించారు. ఆ మరుసటి రోజు అమిత్ అగర్వాల్ ఫోన్ చేసి మరిన్ని డబ్బులు అడగటంతో అనుమానం వచ్చి ఆన్‌లైన్‌లో విచారించగా అదంతా మోసమని తెలిసింది. ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తికోసం ప్రయత్నించగా స్పందించకపోవడంతో మోసపోయానని వేణుగోపాల్ రెడ్డి గ్రహించారు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రష్యా సైన్యం నుంచి భారత హెల్పర్లు తిరిగి రాక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: రష్యా సైన్యంలో 'సెక్యూరిటీ హెల్పర్లు'గా పనిచేస్తున్న భారతీయులను అక్కడి ప్రభుత్వం తిప్పిపంపింది. భారత ప్రభుత్వ డిమాండును మన్నించి వారిని వెంటనే ఆర్మీ నుంచి పంపించివేసిందని సోమవారం విదేశీ వ్యవహారాల శాఖ ప్రకటించింది. భారత్‌కు చెందిన కొందరు వ్యక్తులు రష్యా సైన్యంలో సహాయ సిబ్బందిగా నియమితులయ్యారు. అయితే ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొనాలని ఒత్తిడి చేయడంతో వారిలో ఆందోళన మొదలయింది. తమను ఆదుకోవాలని రష్యాలోని భారత రాయబార కార్యాలయాన్ని కోరారు. ఈ సమస్యను ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. విదేశీ వ్యవహారాల శాఖ చేసిన కృషి ప్రయత్నంగా రష్యా ప్రభుత్వం వారిని తిప్పి పంపించడానికి సిద్ధమయింది. వారిలో కొందరు ఇప్పటికే స్వదేశానికి పయనమయ్యారు. భారతీయులు ఎవరూ యుద్ధ క్షేత్రంలో విధులకు వెళ్లకూడదంటూ గత వారమే విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ హెచ్చరించడం గమనార్హం.

ట్రూకాలర్‌లో ఏఐ ఆధారిత కాల్ రికార్డింగ్ ఫీచర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: స్వీడన్‌కు చెందిన కాలర్ ఐడెంటిఫికేషన్ యాప్ ట్రూకాలర్.. భారత్‌లో ఆర్టిఫీషియల్ ఆధారిత (ఏఐ) ఆధారిత కాల్ రికార్డింగ్ ఫీచర్‌ను ప్రారంభించినట్టు సోమవారం ప్రకటించింది. ఏఐ కాల్ రికార్డింగ్ అనేది పెయిడ్ (చెల్లింపు) ఫీచర్ అని, ఇది ట్రూకాలర్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌లో అందుబాటులో ఉంటుందని పేర్కొంది. ఆండ్రాయిడ్, ఐవోఎస్ డివైజ్‌లలోఇది పని చేస్తుందని తెలిపింది. ప్రీమియం ప్లాన్‌లో భాగంగా ఏఐ ఆధారిత కాల్ రికార్డింగ్ సదుపాయం నెలకు రూ.75తో లేదా ఏడాదికి రూ.529తో ప్రారంభం అవుతుందని పేర్కొంది.

కార్తీ చిదంబరంపై ఈడీ తాజా చార్జిషీటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరంపై ఈడీ తాజాగా మరో ఛార్జిషీటు దాఖలు చేసింది. ఆయన తండ్రి పి.చిదంబరం కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు 2011లో చైనా జాతీయులకు అక్రమంగా వీసాలు ఇప్పించారంటూ కేసు నమోదు చేసింది. దీనిపై మార్చి 16న విచారణ జరపనున్నట్టు ప్రత్యేక న్యాయస్థానం తెలిపింది.

వనపర్తి మునిసిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాసం

» కలెక్టర్‌కు నోటీసు అందజేసిన కౌన్సిలర్లు

» తిరుమలగిరి ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్‌లపై కూడా..



కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేస్తున్న కౌన్సిలర్లు

వనపర్తి టౌన్, తిరుమలగిరి, ఫిబ్రవరి 26: వనపర్తి మునిసిపాలిటీలో అవిశ్వాసానికి రంగం సిద్ధమైంది. బీఆర్‌ఎస్‌కు చెందిన ఛైర్మన్ గట్టుయాదవ్, వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్‌కు వ్యతిరేకంగా ఆ పార్టీ కౌన్సిలర్లు సోమవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను కలిసి అవిశ్వాసానికి సంబంధించిన నోటీసు అందజేశారు. వీరికి కాంగ్రెస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలపడంతో బల నిరూపణ జరిగే అవకాశం ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తర్వాత బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధం కాగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి అసమ్మతి కౌన్సిలర్లతో చర్చలు జరిపారు. మూడుసార్లు ఈ చర్చలు జరిగాయి. చివరకు సోమవారం కలెక్టర్‌ను కలిసి అవిశ్వాసానికి నోటీసు అందజేశారు. వనపర్తి మునిసిపాలిటీలో 33 వార్డులు ఉండగా కాంగ్రెస్ నుంచి 9 మంది, టీడీపీ నుంచి ఒకరు, బీఆర్ఎస్ నుంచి 23 మంది కౌన్సిలర్లున్నారు. కలెక్టర్‌కు ఇచ్చిన నోటీసులో 15 మంది బీఆర్ఎస్, ఏడుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఒక టీడీపీ కౌన్సిలర్ సంతకాలు చేయగా కాంగ్రెస్ నుంచి ఇద్దరు, 8 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు సంతకాలు చేయలేదు. బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు కాంగ్రెస్ మద్దతు తీసుకోవడంతో బలనిరూపణ తర్వాత కొత్తగా ఎన్నికయ్యే వారు బీఆర్ఎస్‌లోనే ఉంటారా లేక కాంగ్రెస్‌లోకి వెళ్తారా అనేది తేలనుంది.

'తిరుమలగిరి' ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్‌లపైనా...

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపల్ ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్‌లపై అవిశ్వాసానికి రంగం సిద్ధమైంది. సోమవారం 8 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ వెంకటరావును కలిసి అవిశ్వాస తీర్మాన పత్రాలు అందజేశారు. తిరుమలగిరి మునిసిపాలిటీలో 15వార్డులుండగా.. బీఆర్ఎస్ నుంచి ఎనిమిది, కాంగ్రెస్ నుంచి ఆరు, బీజేపీ నుంచి ఒక కౌన్సిలర్ ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన పోతరాజు రజనీ, సంకేపల్లి రఘునందన్‌రెడ్డి ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. మునిసిపల్ పాలనా వ్యవహారాల్లో ఛైర్‌పర్సన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. అవినీతికి పాల్పడుతూ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించడంలేదంటూ 8 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం ప్రతిని అందజేశారు. దీన్ని పరిశీలించి సమావేశం నిర్వహణ తేదీ నిర్ణయిస్తామని కలెక్టర్ తెలిపారని కౌన్సిలర్ ఎల్సోజు నరేష్ చెప్పారు.

మా పొత్తు సూపర్‌హిట్

చెడగొట్టేందుకు శతవిధాలా జగన్ యత్నాలు: చంద్రబాబు



శ్రీకాకుళం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): 'టీడీపీ-జనసేన కాంబినేషన్ సూపర్‌హిట్. వైసీపీకి ప్యాంటు తడిసిపోతున్నాయి' అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. తమ మధ్య పొత్తు కుదరకుండా చెడగొట్టడానికి సీఎం జగన్ శతవిధాలుగా ప్రయత్నించాడని.. ఇప్పుడు సోషల్ మీడియా ద్వారా కుట్రలు పన్నుతున్నాడని ధ్వజమెత్తారు. 'రా కదలిరా' కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం ఇక్కడ భారీ బహిరంగ సభ నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, మాజీ మంత్రులు కిమిడి కళావెంకట్రావు, గుండ అప్పల సూర్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, కోండ్రు మురళీమోహన్, మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, కలమట వెంకటరమణ, బగ్గు రమణమూర్తి, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, జనసేన నాయకులు పాల్గొన్నారు. ఈ పొత్తు తన కోసమో, పవన్ కల్యాణ్ కోసమో కాదని.. ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల సంక్షేమం కోసమేనని చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. 'మా పొత్తును ప్రజలు ఆమోదించారు. మాకూ అవగాహన ఉంది. మధ్యలో మీకేంటి బాధ? కులాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. వైసీపీవి నీచ, చవట రాజకీయాలు. అందుకే ఆ పార్టీకి స్వస్తి పలకాలి. వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా అందరం కృషిచేద్దాం' అని పిలుపిచ్చారు. జగన్‌ను ఉత్తరాంధ్ర ద్రోహిగా అభివర్ణించారు. జీవితంలో వాస్తవాలు చెప్పడని.. అబద్ధాలు చెప్పడంలో పీహెచ్‌డీ చేశాడని ధ్వజమెత్తారు. సోషల్ మీడియాలో కుట్రలకు పాల్పడుతున్నాడని.. కులాల మధ్య చిచ్చుపెడుతున్నాడని దుయ్యబట్టారు. సైకో పాలనతో రాష్ట్రం నిరుద్యోగంలో నంబర్ వన్ అయిందన్నారు. 'రాష్ట్రంలో ఏ ఒక్కరికీ భద్రత లేదు. చివరకు మీడియాకూ భద్రతలేదు. వారిపైనా దాడులు చేయిస్తున్నాడు. వారికి వ్యతిరేకంగా జీవో 243 తీసుకొచ్చాడు'అని ధ్వజమెత్తారు. ఇంకా ఏమన్నారంటే..

కొత్త నాటకాలు..

ఈ జగన్ కొత్తనాటకాలకు తెరతీశాడు. పేదల మనిషంట! వేల కోట్లను దోచుకుని.. పేదల పథకాలను రద్దు చేసి పేదల ప్రతినిధినని చెప్పుకొంటున్నాడు. నువ్వు ఏవిధంగా పేదల మనిషివి? ప్రజలను అంతం చేయాలని చూస్తున్న భస్మాసురుడివి. తొమ్మిది దఫాలు విద్యుత్ చార్జీలు పెంచావు. పేదలపై రూ.65 వేల కోట్ల భారం మోపావు. ఇందుకేనా సిద్ధమని ప్రగల్భాలు పలుకుతున్నావు. 24 గంటలపాటు కరెంట్ ఇచ్చావా? నువ్వు మాత్రం రూ.20 కోట్లతో బుల్లెట్ ప్రూఫ్ బస్సులు కొనుక్కున్నావు. హెలికాప్టర్లో తిరుగుతూ.. పోలీసులను, పరదాలను అడ్డుపెట్టుకుని ప్రజల్లోకి వస్తున్నావు. పేదలకు అన్నం పెడితే సహించలేక అన్న క్యాంటీన్లను తొలగించేశావ్. అప్పట్లో రూ.50 ఉండే మద్యం క్వార్టర్.. ఇప్పుడు రూ.200 చేసేశావు. నాసిరకం మద్యం విక్రయిస్తూ పేదల రక్తం తాగుతున్న నువ్వు పేదల ప్రతినిధివి ఎలా అవుతావ్? మేం ఉచితం ఇసుకను ఇస్తే.. ఇప్పుడు మంత్రులు, మీ పార్టీ నాయకులు పంచుకుంటున్నారు. దొంగలని ఎవరిని అనాలి?

వైసీపీకి అభ్యర్థుల్లేరు..

వైసీపీ తరఫున పోటీకి అభ్యర్థులు కూడా లేరాయె! మొన్నటివరకు ఒక్కో లిస్టు రిలీజ్ చేసేసి సిద్ధం అన్నాడు. ఇప్పుడు మాట మార్చి ఆ లిస్టుల్లోని వారు కేవలం నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు అని, అభ్యర్థులు కారని చెబుతున్నారు. నేను అభ్యర్థుల ఎంపిక విషయంలోనూ పారదర్శకంగా ఉన్నా. ఫోన్ ద్వారా అభ్యర్థులను ప్రజల ముందుంచాను.. వైసీపీని ఇంటికి పంపించేయాలన్నదే అందరి ధ్యేయం. రాష్ట్రంలో మీడియాకు కూడా స్వేచ్ఛ లేకుండా పోయింది. వాస్తవాలను చూపిస్తున్న వారిపై దాడులకు పాల్పడుతున్నారు. వైసీపీ సభలో నాది, పవన్ కల్యాణ్ ఫొటోలతో కటౌట్లు పెట్టించి వాటిపై దాడులు చేయించారు. మానసిక రోగులు మాత్రమే ఇలాంటి పనులు చేస్తారు. మా సభలో జగన్ రెడ్డి బొమ్మ పెట్టించి కొట్టించలేమా? అది సభ్యత కాదు. చొక్కా చేతులు మడతపెట్టమని అంటున్నాడు. జగన్‌రెడ్డీ.. మీరు చొక్కా మడతపెడితే మా తమ్ముళ్లు కుర్చీలు మడతపెడతారు. నీకు కుర్చీ లేకుండా చేస్తారు. మిడిసిపడితే బట్టలు విప్పించి తరిమి తరిమి కొట్టే ధైర్యం మా తమ్ముళ్లకు ఉంది.

మాజీ మంత్రి సోమిరెడ్డిపై హత్యాయత్నం

» గడ్డపారతో దాడికి యత్నించిన వైసీపీ సానుభూతిపరుడు

» అడ్డుకున్న టీడీపీ కార్యకర్తలు, తోపులాట

» పోలీసులకు సోమిరెడ్డి ఫిర్యాదు

» 11 మంది టీడీపీ కార్యకర్తలపై కేసు..!

నెల్లూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై హత్యాయత్నం జరిగింది. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కట్టువపల్లిలో సోమవారం సాయంత్రం వైసీపీ సానుభూతిపరుడు బల్లి వెంకటయ్య గడ్డపారతో సోమిరెడ్డిపైకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన టీడీపీ కార్యకర్తలు వెంకటయ్యను అడ్డుకున్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం కట్టువపల్లిలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమిరెడ్డి వస్తున్న నేపథ్యంలో ఆదివారం రాత్రే స్థానిక టీడీపీ నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరుడు బల్లి వెంకటయ్య టీడీపీ ఫ్లెక్సీలను చించి చెరువులో పడేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు సోమవారం ఉదయం మరోమారు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయగా మళ్లీ వాటినీ చించేశారు. సాయంత్రం 4 గంటల సమయంలో సోమిరెడ్డి కట్టువపల్లికి చేరుకోగా మద్యం మత్తులో ఉన్న వెంకటయ్య వీరంగం సృష్టించాడు. అసలు మా గ్రామానికి టీడీపీ వాళ్లు ఎందుకొస్తున్నారు..? అంటూ కేకలు వేశాడు. బాణాసంచా కాలుస్తున్న టీడీపీ కార్యకర్తను కొట్టాడు. గ్రామస్థులు, వెంకటయ్య బంధువులు ఎంత నచ్చజెప్పినా ఆయన పట్టించుకోకుండా రచ్చరచ్చ చేశాడు. చివరకు టీడీపీ కార్యకర్తలు కూడా తిరగబడటంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత సోమిరెడ్డి గ్రామంలో పర్యటిస్తూ గుడిలో పూజలు నిర్వహించి బయటకు వస్తుండగా వెంకటయ్య గడ్డపార తీసుకొని అక్కడికి వచ్చాడు. గడ్డపారను తిప్పుతూ వీరంగం సృష్టించాడు. సోమిరెడ్డిపైకి దూసుకొచ్చేందుకు ప్రయత్నించగా టీడీపీ కార్యకర్తలు అడ్డుకొని వెంకటయ్యకు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన ఒక్కసారిగా గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. అక్కడి నుంచే సోమిరెడ్డి జరిగిన విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు గ్రామానికి చేరుకున్నారు. ఆ తర్వాత కార్యక్రమాన్ని సోమిరెడ్డి ప్రశాంతంగా ముగించారు. అయితే ఈ కార్యక్రమం ముగిశాక వైసీపీ నాయకులు వెంకటయ్య చేత పోలీసులకు ఫిర్యాదు చేయించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా 11 మంది టీడీపీ కార్యకర్తలపై హత్యాయత్నం కేసు(సెక్షన్ 307) నమోదు చేసినట్లు సమాచారం. అయితే పోలీసులు మాత్రం దీనిని బయటకు చెప్పడం లేదు. ఫిర్యాదిదారుడిని ఆసుపత్రికి తరలించామని, వైద్యుల రిపోర్టు ప్రకారం కేసు నమోదు చేస్తామని చెబుతున్నారు. అయితే వీరంగం సృష్టించిన వెంకటయ్యపై నెల్లూరు జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నట్లు తెలిసింది.



రెడ్డిపల్లి గ్రామంలోని పంట పొలాల మధ్య కింది నుంచి ప్రమాదకరంగా వేళాడుతున్న విద్యుత్ తీగలు

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 26 : మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో పంటపొలాల్లో విద్యుత్ తీగలు కిందికి వేళాడుతున్నాయి. చేతికి అందేంత ఎత్తులో ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలపై ప్రమాదకరంగా వేళాడుతున్న తీగలను తొలగించాలని ఏడాదిగా విద్యుత్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని బాధిత రైతు నవీన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వెంటనే కరెంటు వైర్లను సరిచేయాలని రైతులు కోరుతున్నారు. లేనియెడల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

సేవాలాల్ మహరాజ్ క్రికెట్ కప్ విజేత ఇబ్రహీంపట్నం జట్టు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని ఎల్‌బీస్టేడియంలో మూడు రోజులుగా నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ క్రికెట్ కప్ పోటీల్లో కెఎస్‌ఎం ఇబ్రహీంపట్నం జట్టు విజేతగా నిలిచింది. మాజీ ఎంపీ వి.హనుమంతరావు విజేతకు ట్రోఫీతో పాటు లక్ష రూపాయల నగదు బహుమతి, రన్నర్‌గా నిలిచిన శంషాబాద్ జట్టుకు యాభై వేల నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికి సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కేంద్రాల్లో 15 ఎకరాల విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని కోరారు. టోర్నమెంట్ నిర్వాహకుడు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ మాట్లాడుతూ గిరిజన క్రీడాకారులను ప్రోత్సహించడానికి సేవాలాల్ మహరాజ్ జ్ఞాపకార్థం పోటీలను నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్న శ్రీశైలం యాదవ్, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, వెయిట్ లిఫ్టర్ సుకన్య, రాజేందర్‌నాయక్, భరత్‌చంద్రారెడ్డి, నవీన్‌నాయక్, అయ్యప్ప, దిలీప్ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం జట్టుకు కప్పు అందజేస్తున్న మాజీ ఎంపీ వీహెచ్ తదితరులు

ప్రయాణికులకు అనుగుణంగా
సౌకర్యాలు పెంచాలి

» అమృత్ భారత్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, చిత్రంలో మున్సిపల్ ఛైర్మెన్ కొందూటి నరేందర్

షాద్‌నగర్, ఫిబ్రవరి 26 : పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా రైళ్లు, రైల్వే స్టేషన్లలో సౌకర్యాలను కల్పించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ సమావేశంలో రైల్వే స్టేషన్ల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. షాద్‌నగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.9.59కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధుల మాటలు నమ్మి అనవసరమైన చోట రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్‌ల నిర్మాణాలతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి డిజైన్‌లు రూపొందించి ఆ తర్వాత అలైన్‌మెంట్ మార్చడం శ్రేయస్కరం కాదన్నారు. రైల్వే ఇంజినీరింగ్ అధికారులు కూడా ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేయాలని సూచించారు. రైల్వే ట్రాక్ కింద నిర్మించే అండర్ పాస్ బ్రిడ్జిలు ప్రయాణికులకు పెద్దగా ఉపయోగకరంగా ఉండటం లేదని, చిన్నపాటి వర్షాలు కురిసినా అండర్ పాసుల్లో నీరు చేరి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. కార్యక్రమలో మున్సిపల్ ఛైర్మన్ కె.నరేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, అధికార ప్రతినిధి వెంకటేష్‌గుప్తా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, ఎ.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానించి అవమానిస్తారా? : బీజేపీ నాయకులు

అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ సమావేశంలో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులకు సోమవారం ప్రారంభోత్సవం చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమానికి తమను ఆహ్వానించి స్టేజీ మీదకి పిలువకుండా అవమానిస్తారా? అని బీజేపీ నేతలు, రైల్వే బోర్డు మెంబర్ అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డిని స్టేజిపైకి ఆహ్వానించాలని స్థానిక బీజేపీ నాయకులు బాబయ్య, వెంకటేశ్‌గుప్తాలు విజ్ఞప్తి చేసినా రైల్వే అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అలాగే షాద్‌నగర్‌కు చెందిన సీనియర్ సిటిజన్ నాగిళ్ల గోపాల్ గుప్తా ఆవేశానికి లోనై స్టేజీ మీద అమర్చిన మైక్‌ను ఆఫ్ చేసి నిరసన వ్యక్తం చేశారు. అసహనానికి గురైన బొక్క నర్సింహారెడ్డి కార్యక్రమం మధ్యనే వెనుతిరిగి వెళ్లిపోయారు. రైల్వే బోర్డు మెంబర్ కూడా తన పదవికి రాజీనామా చేస్తానంటూ మధ్యలోనే వెళ్లిపోయారు. ప్రధానమంత్రి వర్చువల్ కార్యక్రమం రసాభాసగా మారడంతో ఆహ్వానితులు అసంతృప్తి వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్యను పెంచాలి

» డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి


కొందుర్గు, ఫిబ్రవరి 26: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్యను పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల టార్గెట్‌ను పూర్తి చేయాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు అమృతా జోసఫ్, డాక్టర్ తబస్సుమ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ ప్రగతికి బ్రేక్!



» 8నెలలుగా విడుదల కాని నిధులు.. పనులకు ఆటంకం

» తాండూరు మున్సిపాలిటీకే రెండు కోట్ల బకాయిలు » కొత్త సర్కారైనా నిధులు విడుదల చేస్తుందా



తాండూరు, ఫిబ్రవరి 26 : నిధుల కొరతతో పట్టణాభివృద్ధికి బ్రేక్ పడింది. ఎనిమిది నెలలుగా ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు. ఆర్థిక సంఘం, పట్టణప్రగతి నిధులు మున్సిపాలిటీలకు ఎంతో ఉపయోగపడుతాయి. అవి కూడా నిలిచిపోయాయంటే మున్సిపాలిటీల ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. పెద్ద మున్సిపాలిటీలకు సొంత వనరులుండగా, కొత్తగా ఏర్పడిన, చిన్న మున్సిపాలిటీలకు నిధులు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వికారాబాద్ జిల్లాలో తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలున్నాయి. వీటికి 2023 జూలై నుంచి పట్టణ ప్రగతి నిధులు నిలిచిపోయాయి. వాటి విడుదలకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని ఆయా మున్సిపాలిటీలు ఎదురు చూస్తున్నాయి. నిధుల లేమి కారణంతో మున్సిపాలిటీ పరిధిలో చేసిన పనులకు బిల్లుల కోసం వస్తున్న కాంట్రాక్టర్లకు సమాధానం చెప్పలేక అధికారులు తలపట్టుకుంటున్నారు. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నారని, బిల్లులు రాకుండా పనులు ఎలా చేయాలని పలువురు కాంట్రాక్టర్‌లు వాపోతున్నారు. పట్టణ ప్రగతి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో మున్సిపాలిటీలకు నిధులు మంజూరు చేయాలని పాలకవర్గ సభ్యులు, కాంట్రాక్టర్లు, డిమాండ్ చేస్తున్నారు.

ప్రగతి నిధులు ఇలా

మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి, సుందరీకరణ, పనులు, పారిశుధ్యం, పచ్చదనం, విద్యుత్ సదుపాయం లేని ప్రాంతాలలో విద్యుద్దీకరణ పనులు మురుగుకాల్వల మెరుగు వంటి పనులను ఈ నిధులతో చేపట్టేందుకు అవకాశముంటుంది. విద్యుత్ బిల్లులను కూడా ఈ నిధుల నుంచే చెల్లించవల్సి వచ్చేది.

జనాభా ఆధారంగా నిధులు

జనాభా ఆధారంగా పట్టణ ప్రగతి నిధులను కేటాయిస్తారు. 2020 నుంచి నిధులను విడుదల చేస్తున్నారు. 2023 జూలై నుంచి ఆగిపోయాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేసేది. ఎన్ని నిధులు విడుదల చేసేది ప్రభుత్వం ముందుగానే మున్సిపాలిటీలకు తెలియపర్చేది. ఆ ప్రకారంగా పనులను చేపట్టేవారు. తాండూరు మున్సిపాలిటీలో 2011 జనాభా ప్రకారంగా 71,008 మంది జనాభా ఉండగా ప్రతినెల రూ.25లక్షలు పట్టణ ప్రగతి గ్రాంటు వచ్చేది. ఎనిమిది నెలలుగా నిలిచిపోవడంతో ఒక్క తాండూరు మున్సిపాలిటీకే రూ.2 కోట్లు నిలిచిపోయాయి. దీంతో అభివృద్ధి కుంటుపడుతోంది. చిన్న మున్సిపాలిటీలైన కొడంగల్, పరిగిల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పట్టణ ప్రగతిని కొనసాగుతుందా..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 3నెలలు కావస్తున్నా పట్టణ ప్రగతి కార్యక్రమానికి నిధుల కేటాయింపు విషయంలో ఎలాంటి స్పష్టతరాలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని నిధులను కలిపి పట్టణ ప్రగతి గ్రాంటుగా విడుదల చేసేది. కొత్త ప్రభుత్వంలో పాత విధానం ద్వారా నిధులు విడుదల చేస్తారా.. లేదా అనే అంశం ఏప్రిల్‌లో తేలనుంది.

పనులకు ఆటంకం

పట్టణప్రగతి ప్రధాన లక్ష్యం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుధ్య పనులు చేపట్టాల్సి వుంటుంది. అదేవిధంగా మౌలిక సదుపాయాలు, హరితహారం కింద మొక్కల పెంపకంతో పచ్చదనం పెంపొందించాలి. కానీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఈ పనులకు ఆటంకం ఏర్పడుతోందని పాలక మండలి సభ్యులు చెబుతున్నారు. నిధులు విడుదల కాక పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదు. పలు అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్‌లు చేతులెత్తేస్తున్నట్లు సమాచారం. దీంతో ఆయా పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

చేవెళ్ల సభను విజయవంతం చేయాలి


పరిగిలో విలేకరులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


తాండూరు మండలం బొంకూరులో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పరిగి,ఫిబ్రవరి 26: చేవెళ్ళలో నేడు మంగళవారం జరగనున్న కాంగ్రెస్ పార్టీ బహిరంగసభకు భారీ ఎత్తును తరలివచ్చి విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి కోరారు. పరిగిలోని తన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ఈ సభకు హాజరవుతారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందుకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా చేవెళ్ల సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లక్ష మందితో సభను నిర్వహిస్తున్నామని, పరిగి నుంచే పది వేల మందిని తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీ కార్యదర్శులు బి.బీంరెడ్డి, కె.హన్మంత్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, పరిగి, దోమ, కులకచర్ల, చౌడాపూర్, గండీడ్ మండలాల అధ్యక్షులు బి.పరుశరాంరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, బీఎస్ ఆంజనేయులు, అశోక్, జితేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, తావుర్యానాయక్, రాములునాక్ పాల్గొన్నారు.

తాండూరు నుంచి 20వేల మంది కార్యకర్తలు..

తాండూరురూరల్: చేవెళ్లలో నేడు(మంగళవారం) నిర్వహించే కాంగ్రెస్ భారీ బహిరంగ సభకు తాండూరు నియోజకవర్గం నుంచి 20వేల మంది కార్యకర్తలను తరలిస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొంకూరు గ్రామంలో శివాలయాన్ని సందర్శించిన అనంతరం సోమవారం విలేకరులతో మాట్లాడారు. బొంకూరు, బిజ్వార్ గ్రామాల మధ్య కాగ్నా నదిపై బ్రిడ్జి నిర్మాణానికి గతంలో ఎమ్మెల్యేగా ఉన్న రోహిత్ రెడ్డి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారని తెలిపారు. ప్రస్తుతం ఎందుకు కాలయాపన చేస్తున్నారంటూ విలేకరులు ప్రశ్నించగా ప్రస్తుతం నిధులు లేవని, గతంలో పూర్తిస్థాయిలో నిధులు లేక ఉత్తుత్తి శంకుస్థాపనలు చేశారని అన్నారు. అన్నిగ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ కిందసీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేశామన్నారు. ప్రజలు ఎలాంటి అనుమానాలకు గురికాకుండా తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించినందుకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. చేవెళ్ల భారీ బహిరంగసభకు తాండూరు నుంచి కాంగ్రెస్ కార్యకర్తలంతా ముందుకువచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పెద్దేముల్ మండల కాంగ్రెస్ నాయకులు జితేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, కొమ్ము గోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

నవాబుపేట: చేవెళ్లలోని ఫరా కళాశాల మైదానంలో మంగళవారం(నేడు) నిర్వహించే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలను కాంగ్రెస్ పార్టీ అధినాయకురాలు ప్రియాంకగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు. బహిరంగసభకు నవాబుపేట మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రేవంత్‌రెడ్డి అభిమానులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

సీఎంను కలిసిన తాండూరు ఎమ్మెల్యే



తాండూరు, ఫిబ్రవరి 26: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి కల్వ సుజాత మర్యాద పూర్వకంగా కలిశారు. తాండూరు నియోజకవర్గంలో పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

ఆంజనేయస్వామి స్వామి దివ్యస్తంభం, నవగ్రహాల ఊరేగింపు


కోలాటం ఆడుతున్న మహిళలు

కొడంగల్, ఫిబ్రవరి 26: కొడంగల్ పట్టణంలోని కార్గిల్ కాలనీలో ఆంజనేయస్వామి విగ్రహ దివ్యస్తంభం, నవగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలతో వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం రాత్రి ఆంజనేయస్వామి దివ్యస్తంభం, నవగ్రహాలను అంబేడ్కర్ చౌరస్తా మీదుగా భజనలు, కోలాటంతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

మేడ్చల్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి), ఫిబ్రవరి 26 : గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఎనిమిది నెలలుగా కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో ఆ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ వద్ద కార్మికులు ఆందోళన చేశారు. అనంతరం జిల్లా అధికారులకు వినతి పత్రం అందజేశారు.

'రైతులను కేంద్ర ప్రభుత్వం అణచివేస్తోంది'

వికారాబాద్, ఫిబ్రవరి 26: ఢిల్లీలో రైతులు చేస్తున్న న్యాయబద్ధమైన ధర్నా, నిరసనలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అణచివేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిట్ అన్నారు. సోమవారం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాల్ రెడ్డి, బషీర్ అహ్మద్, పీర్ మొహమ్మద్, వెంకటేశ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ అంచనా బడ్జెట్ రూ.16.64కోట్లు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 26: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ రూ.16.64కోట్లతో రూపొందించిన 2024 - 25 ఆర్థిక సంవత్సర అంచనా బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం పొందినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ తెలిపారు. బడ్జెట్‌పై సోమవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. మున్సిపాలిటీకి ఈ ఆర్థిక సంవత్సరంలో వివిధ విభాగాల నుంచి రూ.16.64కోట్ల ఆదాయం సమాకూరనుందని వివరించారు. మున్సిపాలిటీని మోడల్‌సిటీగా మార్చాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్ పల్గుల మాధవరెడ్డి, కమిషనర్ ఎండీ సాబేర్ అలీ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కొడంగల్ మున్సిపాలిటీ బడ్జెట్ రూ.41.38 కోట్లు

కొడంగల్: మున్సిపాలిటీకి 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.41.38 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఖర్చులు రూ.41.32కోట్లు పోను రూ.6లక్షలు మిగులు బడ్జెట్ అని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశాన్ని సోమవారం చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, కమిషనర్ బలరాంనాయక్, ఏఈ రాకేశ్ రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను జయప్రదం చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 26: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఈనెల 26 నుంచి 29 వరకు జరిగే వారోత్సవాల సందర్భంగా బ్యాంకు అధికారులతో కలిసి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 28, 29తేదీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 29న తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాసరచన, నినాదాలు, పోస్టర్ మూడు విభాగాల్లో పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. లీడ్‌బ్యాంక్ మేనేజర్ రాంబాబు, బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.


మేడ్చల్: ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 173 ఫిర్యాదులను జిల్లా ఎస్సీ కార్పోరేషన్ మల్లేశం, జిల్లా సర్వే ల్యాండ్ అధికారి రాంరెడ్డిలతో కలిసి కలెక్టర్ స్వీకరించారు.

మేడ్చల్ ప్రజావాణిలో 120 ఫిర్యాదులు

మేడ్చల్, (ఆంధ్రజ్యోతిప్రతినిధి): మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 120 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఆయా శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అందజేసి, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు: ఎస్పీ

వికారాబాద్, ఫిబ్రవరి 26: ఇంటర్ పరీక్షల సందర్భంగా జిల్లాలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పరీక్షల కేంద్రాల దగ్గర 144సెక్షన్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరూ పరీక్ష కేంద్రాల వద్ద గుమిగూడొద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవమన్నారు. జిరాక్స్ కేంద్రాలు పరీక్షల సమయంలో మూసి వేయాలన్నారు. వికారాబాద్ సబ్‌డివిజన్ పరిధిలో 11, పరిగి సబ్‌డివిజన్ పరిధిలో తొమ్మిది, తాండూరు సబ్ డివిజన్ పరిధిలో తొమ్మిది మొత్తం 29పరీక్షాల కేంద్రాలు ఉన్నాయి. పరీక్ష కేంద్రాల్లో ఎవరికీ సెల్‌ఫోన్‌లకు అనుమతి లేదన్నారు. జిల్లా ప్రజలు ఇట్టి విషయంపై దృష్టిసారించి పోలీస్ అధికారులకు సహకరించాలని ఆయన తెలిపారు.

'భగీరథ' నీరు వృథా


వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 26: మండల కేంద్రంలో పేరుకే మిషన్ భగీరథ నీటి సరఫరా పథకం ఉన్నా సగం గ్రామానికి సైతం భగీరథ నీరు అందడం లేదు. గ్రామంలో పాత ఎస్సీ కాలనీతో పాటు తెలుగు గేరి, కుమ్మరి వాడ, దుర్గ మాత ఆలయం చుట్టు ఇళ్లతో పాటు బీసీ కాలనీలో సైతం మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో 5 ట్యాంకులు ఉన్నా సగం గ్రామానికి సైతం నీరు సరఫరా కావడం లేదు. తెలుగుగేరిలో మిషన్ భగీరథ పైపులైన్‌లు వేసినా నేటికీ చుక్క నీరు రావడం లేదు. సగం గ్రామానికి గతంలో వేసిన పైపులైన్‌ల ద్వారా బోరు బావులు నీటిని అందిస్తున్నాయి. మండల కాంప్లెక్స్ వెనక ఉన్న ట్యాంకుల ద్వారా గంటల తరబడి నీరు వృథాగా వెళ్తున్నా పట్టించుకోకపోవడం గమన్హారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేసవిని దృష్టిలో ఉంచుకొని పైపులైన్‌ల లీకేజీలకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రైతును రాజుగా చేసే దిశగా అడుగులు


డ్రోన్ సాయంతో మందులను పిచికారి చేస్తున్న నెదర్లాండ్ రోబో బ్యాంక్ బృందం

శామీర్‌పేట, ఫిబ్రవరి 26: నెదర్లాండ్స్ రోబో బ్యాంక్, బేయర్ కంపెనీ సహకారంతో రైతులను రాజులు చేసేదిశగా అడుగులు పడ్డాయని శామీర్‌పేట రైతు సేవా సహకార సంఘం చైర్మన్ మధుకర్‌రెడ్డి అన్నారు. శామీర్‌పేట రైతు సేవా సహకార సంఘం కార్యాలయాన్ని సోమవారం నెదర్లాండ్స్ దేశానికి చెందిన రోబో బ్యాంక్, బేయర్ కంపెనీ, రాష్ట్రానికి చెందిన సహకార అపెక్స్ బ్యాంక్‌కు చెందిన ప్రతినిధులు సందర్శించి పనితీరును పరిశీలించారు. మూడుచింతలపల్లి మండలంలోని పోతారంలోని పలువురు రైతుల పంటలను కూడా వారు పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రోన్ సాయంతో మందులు చల్లే పనితీరు విధానాన్ని ప్రయోగాత్మకంగా బేయర్ కంపెనీ వారు నెదర్లాండ్స్ బృందంతో కలిసి రైతులకు చూపించారు. రైతు సహకార సంఘం వైస్‌చైర్మన్ ఐలయ్య, మాజీ చైర్మన్ పెంటారెడ్డి, డైరెక్టర్లు, సీఈఓ నర్సింలు, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా కార్యవర్గం ప్రమాణ స్వీకారం

తాండూరు, ఫిబ్రవరి 26: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తాండూరు పట్టణం వికారాబాద్ జిల్లా కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఆర్యవైశ్య కళ్యాణ మంటపంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా చేతుల మీదుగా కార్యవర్గాన్ని కమిటీలను ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా తాండూరులో పేదలకు పుస్తెమెట్టెలు, దుస్తులు అందజేశారు. వేముల సురేందర్ సహకారంతో కుట్టు మిషన్లు అందజేశారు. గాజీపూర్ గ్రామం హైస్కూల్‌కి సంతోష్‌కుమార్ సహకారంతో సీలింగ్ ఫాన్స్ ఇచ్చారు.

కల్యాణం.. కమనీయం


సంగమేశ్వరాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న ఎంపీటీసీ దంపతులు

బషీరాబాద్, ఫిబ్రవరి 26: సంగమేశ్వరాలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణరావు కుమారుడు ఎం.రోహిత్‌మహరాజ్ నేతృత్వంలో స్థానిక ఎంపీటీసీ దంపతులు రేఖపవార్‌ఠాగూర్ దగ్గరుండి పార్వతీపమేశ్వరుల కల్యాణం వైభవంగా జరిపించారు. అంతకు ముందు ఆలయ ప్రధాన పూజారి మహంతయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే సోదరుడు సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

గుడిసెలను తొలగించొద్దు


తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితులు

మేడ్చల్‌టౌన్, ఫిబ్రవరి 26: ఎన్నో సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న తమకు నిరాశ్రయులను చేయొద్దంటూ పలువురు గిరిజనులు సోమవారం మేడ్చల్ తహసీల్దార్ శైలజకు వినతిపత్రం సమర్పించారు. మేడ్చల్ పట్టణంలోని పారిశ్రామిక వాడకు ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 844/6లో దాదాపు మూడు వందల నిరుపేద గిరిజన కుటుంబాలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నాయి. అయితే విజయ్ కుమార్ అనే వ్యక్తి స్థలం ఖాళీచేయాలని బెదిరింపులకు గురిచేస్తున్నాడని బాధితులు తెలిపారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శైలజ గిరిజనులకు హామీ ఇచ్చారు.

సంక్షిప్తంగా..

● **పూడూరు:** వరల్డ్ నఖయామ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన సెకెండ్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ సి.మఅర్‌సింగ్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ జరుగగా, మండల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సోమవారం సోమన్‌గుర్తి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ట్రెడిషనల్ కరాటే అసోసియేషన్ జె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

● **శామీర్‌పేట:** మజీద్‌పూర్‌లో పలువురి దాతల సహకారంతో పెద్దమ్మ తల్లి ఆలయాన్ని ఎంతో వైభవంగా నిర్మిస్తున్నారు. ఈ ఆలయ నిర్మాణానికి మజీద్‌పూర్‌కు చెందిన దాత తుంకి రమేశ్ తనవంతు సాయంగా రూ.లక్ష విరాళంగా అందజేశారు. గ్రామముదిరాజ్ సంఘం సభ్యులు నాటకారి వెంకటస్వామి, గొట్టిముక్కుల మల్లేశ, వల్లపు భిక్షపతి, ఎంపీటీసీ అశోక్‌రెడ్డి అందజేశారు.

● **దోమ:** పండ్ల తోటల పునరుద్ధరణకు కొమ్మ కత్తిరింపుల కోసం 50 శాతం ఆర్థికసాయం అందించనున్నట్లు ఏవో ప్రభాకర్‌రావు, ఉద్యానవన అధికారులు తెలిపారు. వారు సోమవారం మాట్లాడుతూ కొమ్మ కత్తిరింపుల పనికి అయ్యే ఖర్చు రూ.40వేలలో 50శాతం రాయితీపై ఒక్కో రైతుకు హెక్టారుకు రూ.20వేలు ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. మామిడితోట అయితే చెట్లు 15 సంవత్సరాలను మించి ఉండాలన్నారు. బత్తాయి తోట అయితే చెట్లు 10 సంవత్సరాలకు మించి ఉండాలన్నారు.

● **పూడూరు:** పూడూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి.పాండు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11.30గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి వివిధ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

● **పూడూరు:** మండలంలోని తిర్మలాపూర్‌తండాలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న బంజారా ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్, అంబాభవానీ ఆలయ వార్షికోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా సేవాలాల్ బోగ్ బండార్, అమ్మవారికి యజ్ఞ హోమం, ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో సంప్రదాయ నృత్యంతో బంజారా భక్తులు అలరించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి పెంటయ్య ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

● **శామీర్‌పేట:** ప్రభుత్వం కూలీల సంక్షేమానికి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని ఎంపీటీసీ నాగరాజు పిలుపునిచ్చారు. మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామ పరిధిలో కూలీలతో ఉపాధి హామీ పనులను నాగరాజు సోమవారం ప్రారంభించారు.

● **మేడ్చల్ టౌన్:** గౌడవెల్లిలో నిర్మిస్తున్న అండర్ పాస్ బ్రిడ్జి పనులను ప్రధాని మోడీ సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్క్రీన్‌లో తిలకించటానికి స్థానిక ప్రజలతో పాటు తహసీల్దార్ శైలజ, మాజీ ఎంపీపీ పద్మ జగన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి సురేందర్ ముదిరాజ్‌లు విచ్చేశారు.

● **ఘట్‌కేసర్:** చౌదరిగూడలో గల నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో వచ్చేనెల 21 నుంచి 23 వరకు మూడు రోజుల పాటు టెక్ అండ్ ఫార్మా సంప్రతి సదస్సును విజయవంతం చేయాలని ఆ కళాశాల వైస్‌చైర్మన్ నల్లా ప్రశాంత్‌రెడ్డి కోరారు. కళాశాలలో సదస్సు పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ప్రధానంగా పేపర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, ఫార్మాక్విజ్‌లతో పాటు వివిధ రకాలు క్విజ్‌లను నిర్వహించనున్నట్లు వివరించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీ కృష్ణారెడ్డి, ఆయా విభాగాల డీన్లు టీపీవో పాల్గొన్నారు.

● **ఘట్‌కేసర్:** చౌదరిగూడ గ్రామపంచాయతీ పరిధిలో వారంవారం నిర్వహించే శైబజార్(సంత) నిర్వహణకు వేలం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన వేలంలో చౌదరిగూడకు చెందిన వినోద్ రూ.1.32లక్షలు పాడి వేలాన్ని దక్కించుకున్నాడు. డీఎల్‌పీవో సాంబిరెడ్డి పాల్గొన్నారు.

● **పెద్దేముల్:** జనగాంలో రూ.15లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను సోమవారం కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డితో కలిసి జడ్పీటీసీ ధారాసింగ్ ప్రారంభించారు. ఈజీఎస్ కింద ఈ నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గౌడి వెంకటేశం, కార్యదర్శి మల్లికార్జున్, పెంటప్ప, మాజీ ఉపసర్పంచ్ శివకుమార్, గడ్డమల్లప్ప పాల్గొన్నారు.

● **శామీర్‌పేట:** అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న చిన్నారులను చేరదీసి పౌష్టికాహారాన్ని అందిస్తూ వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే హెచ్‌బీఎల్ కంపెనీ ధ్యేయమని ఆ కంపెనీ సీఎస్ఆర్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి అన్నారు. శామీర్‌పేట గ్రామంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం అలియాబాద్ పరిధిలో గల హెచ్‌బిఎల్ కంపెనీ వారు సీఎస్ఆర్ ప్రోగ్రామ్ కింద దత్తత తీసుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని ప్రారంభించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ, ఎంపీపీ ఎల్లుబాయి, జడ్పీటీసీ అనిత పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చెరువులో చేపలవేటకు వెళ్లి యువకుడి మృతి

శామీర్‌పేట, ఫిబ్రవరి 26: చెరువులో చేపలవేటకు యువకుడు మృతిచెందిన సంఘటన శామీర్‌పేట్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మండలంలోని రాజబొల్లారం గ్రామానికి చెందిన యువకుడు సంపత్‌కుమార్, నవీన్, బ్రహ్మ అనే ముగ్గురు స్నేహితులు కలసి ఈనెల 25న ఆదివారం ఉదయం 8గంటల సమయంలో సరదాగా చేపలను పట్టడానికి శామీర్‌పేట పెద్ద చెరువుకు వెళ్లారు. సాయంత్రం వరకు శామీర్‌పేట పెద్ద చెరువు వద్దే ఈముగ్గురు స్నేహితులు ఉండి చేపలను పట్టారు. కాగా సాయంత్రం ప్రమాదవశాత్తు యువకుడు సంపత్‌కుమార్(26) చెరువు నీటిలోనే మునిగి గల్లంతయ్యాడు. మిగతా ఇద్దరు స్నేహితులు నవీన్, బ్రహ్మలు వెంటనే కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారమిచ్చారు. మరుసటి రోజు సోమవారం శామీర్‌పేట పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టి సంపత్‌కుమార్ మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లల కిడ్నాపర్ నెపంతో వ్యక్తికి దేహశుద్ధి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 26: పట్టణంలోని కింది బస్తీలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓగుర్తుతెలియని వ్యక్తిని బస్తీవాసులు దేహశుద్ధి చేసి స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారన్న వదంతులు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో అనుమానాస్పదంగా బస్తీలో తిరుగుతున్న వ్యక్తిని కిడ్నాపర్‌గా భావించి బస్తీవాసులు అతన్ని స్తంభానికి కట్టేసి చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. కాగా, పిల్లల కిడ్నాప్‌ల విషయంలో వదంతులను నమ్మొద్దని మేడ్చల్ సీఐ సత్యనారాయణ సూచించారు. తమకు అప్పగించిన వ్యక్తి మద్యం సేవించి ఉన్నాడని, అతడు కనీసం తన వివరాలు తెలిపే స్థితిలో లేడన్నారు. పూర్తి విచారణ జరిపిన అనంతరం అతడిని కుటుంబసభ్యులకు అప్పగిస్తామని తెలిపారు. బస్తీల్లో అనుమానాస్పదంగా ఎవరైనా తిరిగితే తమకు సమాచారం ఇవ్వాలేగానీ బంధించి చితకబాదరాదని కోరారు.

అక్రమంగా కలప తరలింపు.. ట్రాక్టర్, లారీ పట్టివేత

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 26: మున్సిపల్ పరిధిలోని కొండారెడ్డిపల్లి శివారులోని పొలాల్లో కలపను నరికి ట్రాక్టర్, లారీలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అనుమతులు లేకుండా కలపను సోమవారం అంబేడ్కర్ చౌరస్తా మీదుగా హైదరాబాద్ తరలిస్తుంగా పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనలో పట్టుబడిన ట్రాక్టర్, లారీని ఫారెస్టు అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థిపై చేయి చేసుకున్న ప్రిన్సిపాల్

● కలెక్టర్, డీఈవోకు ఫిర్యాదు

వికారాబాద్, ఫిబ్రవరి 26: స్నానం చేసేందుకు స్కూల్‌పై వాటర్ ట్యాంకు ఎక్కి నీళ్లు తీసుకున్న విద్యార్థిపై పాఠశాల ప్రిన్సిపాల్ చేయి చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. ముస్లిం పెద్దల పండుగ ఉండడంతో మైనార్టీ గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థి ఎండీ ఇస్మాయిల్ ఆదివారం సాయంత్రం 5గంటలకు నీరు సరిగా లేక నీటి ట్యాంకు ఎక్కాడు. అతన్ని చూసి మరి కొంతమంది విద్యార్థులు ట్యాంకుల వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో ట్యాంకులోకి ఉండాల్సిన పైపు బయటకు వదిలేయడంతో నీరు వృథాగా పోయింది. ఇది గమనించిన ఉపాధ్యాయులు సీసీ కెమెరాలో పరిశీలించి ఇస్మాయిల్ వల్లే ఇలా జరిగిందని గుర్తించి విద్యార్థిపై చేయి చేసుకున్నాడు. దీంతో విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పాఠశాల వద్దకు వెళ్లి ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కలెక్టర్, డీఈవోలకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా విద్యార్థి కాలు జారిపడి ఉంటే ప్రాణాలకే ప్రమాదమని భావించి ఆగ్రహం వ్యక్తం చేస్తూ చెయ్యి చేసుకున్నానని తెలిపారు. అంతేకానీ ఉద్దేశపూర్వకంగా కొట్టలేదని స్పష్టం చేశారు. విద్యార్థిని కొట్టిన క్రమంలో తానే బాధపడ్డానని, ఏ విద్యార్థికైనా ఏదైనా జరిగితే పాఠశాలకు చెడ్డపేరు వచ్చేదని అన్నారు. విద్యార్థుల్లో మార్పుల రావాలనే మందలించానని తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు

కొడంగల్, ఫిబ్రవరి 26: కొడంగల్ మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని సన్‌సిటీకాలనీ, గుండ్లకుంట గ్రామంలో సోమవారం ఆయన అధికారులతో కలిసి సందర్శించారు. కాలనీలో మురుగు కాలువలు, సీసీ రోడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలపై ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గుండ్లకుంటలో మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్‌తో కలిసి పర్యటించారు. అభివృద్ధికి కావాల్సిన నిధుల మంజూరుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కటకం శివకుమార్‌గుప్త, మురారి వశిష్ట పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న అమ్మానాన్న ఫౌండేషన్

కొడంగల్, ఫిబ్రవరి 26: అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం కొడంగల్ పట్టణంలో ఓ అనాథకు స్నానం, కటింగ్ చేయించి నూతన వస్త్రాలు అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని చిన్నారులు, అనాథలకు తమ వంతుగా మానవ సేవయే మాధవ సేవగా భావించి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా అనాథలు ఉంటే 6304199466 నెంబర్‌కు సమాచారం అందిస్తే ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలతో ఆదుకుంటామన్నారు.

ఏడాదైనా పూర్తికాని సీసీరోడ్డు పనులు

కులకచర్ల, ఫిబ్రవరి 26: మండల కేంద్రంలోని చౌరస్తా నుంచి పశు వైద్య శాల వరకు ఏడాది కిందట సీసీ డబుల్ రోడ్డు మంజూరైంది. అయితే సదరు కాంట్రాక్టర్ ఓ పక్క సీసీ రోడ్డు వేసి మరో పక్క కంకర వేసి వదిలేశాడు. ఏడాది గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. దీంతో కంకరరోడ్డుపై వాహనాలు వెళ్తున్న సమయంలో దుమ్ము లేస్తోంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పంచాయతీ ట్యాంకర్ ద్వారా రోడ్డుపై దుమ్ము లేవకుండా నీటిని చల్లించారు.

అంగన్‌వాడీ హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి

వికారాబాద్, ఫిబ్రవరి 26: అంగన్‌వాడీ హెల్పర్స్‌కు పాత పద్ధతిలో పదోతరగతి ఉన్న వారికి ప్రమోషన్స్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మహిపాల్, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షుడు నరసమ్మ తెలిపారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 9వేలకు పైగా హెల్పర్స్‌ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పెన్షన్ సౌకర్యం రూ.10వేలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బుగ్గ ఆలయంలో శివపూజ

వికారాబాద్, ఫిబ్రవరి 26: పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు, పట్టణ ప్రముఖులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

శ్రీశైలానికి శివస్వాముల పాదయాత్ర

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 26: మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గ్రామం నుంచి శివస్వాములు సోమవారం శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. అంతకుముందు గ్రామంలోని శివాలయంలో శివలింగానికి పంచామృత అభిషేకం, అలంకరణ, శివాష్టోత్తర శత నామావళి, దూపదీప నైవేద్యాలను సమర్పిస్తూ మంగళ హారతులు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గురుస్వాముల ఆధ్వర్యంలో శివస్వాములకు ఇరుముడులు కట్టి ఆశీర్వదించారు.

మేడ్చల్ టౌన్: పట్టణంలో శివమాల ధరించిన భక్తులు సోమవారం శ్రీశైలం మల్లికార్జున స్వామి వారిన దర్శించుకోవటానికి పాదయాత్రగా బయలుదేరారు. పట్టణంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద స్వాములు జోతిర్ముడి కట్టుకుని ప్రయాణం ప్రారంభించారు.

కొడంగల్: అన్నారం గ్రామానికి చెందిన పలువురు శివస్వాములు శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. గ్రామంలోని శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలతో ఇరుముడులు ధరించి పాదయాత్రగా శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు.

బషీరాబాద్: మండలంలోని శివస్వాములు పలువురు నవాంధ్రీ సంగమేశ్వరాలయం నుంచి సోమవారం శ్రీశైలంకు పాదయాత్రగా బయలుదేరివెళ్లారు. ఈ పాదయాత్రలో మాధవరెడ్డి, రవీందర్‌రెడ్డి గురుస్వాముల నేతృత్వంలో 40 మంది శివస్వాములు శ్రీశైలం వెళ్లారు.